# బండి సంజయ్‌పై కన్నం వ్యాఖ్యలు సరికాదు

### బిజెపి దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్

కరీంనగర్, మార్చి 14 (మనం న్యూస్): బిజెపి నాయకులు కన్నం అంజయ్య రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కుమార్‌పై బిజెపి నాయకులు కన్నం అంజయ్య అనుచిత వ్యాఖ్యలు సరికాదని బిజెపి దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్ అన్నారు. కన్నం అంజయ్యకు దళితులపై ఇప్పుడే ఎనలేని ప్రేమ ఎందుకు వచ్చింది.? అంజయ్య ఎప్పుడైనా దళితుల సమస్యల కోసం పోరాటం చేశారా..? మాట్లాడారా..? దళితుల గురించి మాట్లాడే నైతిక అర్హత కన్నం అంజయ్యకు లేదని విమర్శించారు. మంగళవారం కరీంనగర్ లోని జిల్లా పార్టీ కార్యాలయంలో బిజెపి దళిత ప్రతినిధులు, దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్ రెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి జానపట్ల స్వామి,జిల్లా అధ్యక్షుడు సోమిడి వేణు ప్రసాద్, మీడియా సెల్ జిల్లా కన్వీనర్ కటకం లోకేష్ ,సొల్లు అజయ్ వర్మలతో కలిసి ఆయన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీలో దళిత మోర్చా పటిష్టంగా ఉందని , దళితుల అనేక సమస్యల కోసం పోరాటం చేసిందన్నారు. బిజెపిలో దళిత ప్రతినిధులు అంతా సమిష్టి గ పనిచేస్తూ , దళిత సమాజాన్ని మోసం చేసిన కేసీఆర్ ప్రభుత్వం పై పోరాటం చేస్తుందన్నారు. దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాల భూమి , 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం లాంటి ఎన్నో హామీలను కెసిఆర్ ప్రభుత్వం విస్మరించడమే కాకుండా అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కూడా మార్చాలనే వ్యాఖ్యలు చేసిందన్నారు. దళిత వ్యతిరేకిగా మారిన కేసీఆర్ ప్రభుత్వానికి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ సారథ్యంలో దళిత మార్చ అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు.

ఇలాంటి విషయాలు కన్నం అంజయ్యకు కనబడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి విషయాల్లో పార్టీ తోకలిసి బిఆర్ఎస్ ప్రభుత్వం మీద పోరాటం చేయాల్సిన కన్నం అంజయ్య బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ పై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కన్నం అంజయ్య భారతీయ జనతా పార్టీలో రెండు దశాబ్దాల కాలంగా వివిధ హోదాల్లో పనిచేశారని,ఎమ్మెల్యే టికెట్ పొంది పోటీ చేసిన విషయం మర్చిపోయి తిరిగి నేడు పదవుల కోసం దిగజారిపోయి బండి సంజయ్ కుమార్ పై విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. భారతీయ జనతా



పార్టీ సిద్ధాంతం, రాజకీయ వ్యవహారాలు తెలిసిన ఎవరు కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేయరన్నారు. పార్టీలో జాతీయస్థాయి నేతలు మొదలుకొని గ్రామస్థాయి వరకు కొత్తవారికి అవకాశం ఇచ్చి , సీనియర్లను తగిన విధంగా అవకాశం వచ్చినప్పుడు అవకాశాలు కల్పించి గౌరవించుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పార్టీ అధ్యక్షబాధ్యతలు చేపట్టిన బండి సంజయ్ కుమార్ కెసిఆర్ పార్టీకి ధీటుగా బిజెపిని తీర్చిదిద్దడానికి అన్ని వర్గాల వారికి అవకాశం కల్పించారని,పార్టీ కి సేవ చేస్తూకార్యకర్తలుగా కొనసాగిన వారికి అవకాశం కల్పించి, సీనియర్ల సహాయ సహకారలతో రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కుమార్ పార్టీని బలమైన శక్తిగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. పార్టీలో రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కుమార్ దళితులకు స్థానం కల్పించలేదని కన్నం అంజయ్య అసత్య వ్యాఖ్యలు చేస్తున్నారని, మాలాంటి ఎంతోమంది కి దళిత ప్రతినిధులకు సముచిత స్థానం దక్కిందని,. పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శిగా బంగారు శృతి, సంజయ్ కుమార్ కార్యవర్గంలో పనిచేస్తున్నారన్నారు . పార్టీ సిద్ధాంతం, రాజకీయ వ్యవహారాలు తెలిసిన వారు ఎవరు కన్నం అంజయ్యల వ్యాఖ్యలు చేయరని, ఇన్నేళ్లు పదవులు అనుభవించిన , ఇంకా పదవులు తనకే కావాలి, పార్టీకి మాత్రం పని చేయమనే రీతిలో కన్నం అంజయ్య వ్యవహారం ఉందన్నారు. ఇన్నేళ్లు పదవులు అనుభవించిన ఆయన పార్టీ అభివృద్ధి కోసం చేసిన పని ఏంటి?.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసింది ఏంటి..? కెసిఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడింది ఏంటి..? కనీసం టికెట్ ఇచ్చిన ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ సమస్యల కోసం ఎప్పుడైనా మాట్లాడారా..? అక్కడి మంత్రి కొప్పుల ఈశ్వర్ కు వ్యతిరేకంగా మాట్లాడారా..? స్పష్టం చేయాలన్నారు. నేడు పనిగట్టుకుని బండి సంజయ్ కుమార్ పై అక్కసు వెళ్ళగక్కడంలో ఆంతర్యం ఏంటి..? వీటన్నిటికీ కన్నం అంజయ్య సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మి నారాయణ, దళిత మోర్చా కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సోమిడి వేణు, రాష్ట్రా అధికార ప్రతినిధి జాడి బాల్ రెడ్డి, దిశ కమిటీ మెంబర్ జానపట్ల స్వామి, బీజేపీ సీనియర్ నాయకులు, మహిళ మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు మామిడి చైతన్య, దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి పుల్లమల్ల ప్రసాద్, తూర్పటి రాజు, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు రాములు ,బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు ఇసారి జాశ్వంత్, దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఎలుక రాజేష్, మానకొండూర్ మండల అధ్యక్షులు శ్రీహరి, మోర్చా నాయకులు పవన్ తదితరులు పాల్గొన్నారు.

## మ్యాథ్స్, సైన్స్ ఒలంపియాడ్‌లలో అల్ఫోర్స్ విద్యార్థులకు జాతీయ స్థాయి ర్యాంకులు



కొత్తపల్లి, మార్చి 14 (మనం న్యూస్): ఓఎంఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి మ్యాథ్స్, సైన్స్ ఒలంపియాడ్‌లో కరీంనగర్‌లోని అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ర్యాంకులు సాధించారు. మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో 9వ తరగతికి చెందిన రితిక దూడం, సరనిచంద్ర నల్ల, రిషేంద్ర తొంటి, ఎనిమిదవ తరగతికి చెందిన ఉత్కర్ష్ సాయి కొల్లూరి, ప్రెష్మరెడ్డి తోట, ఆరవ తరగతికి చెందిన సువన పటేల్ రాచకొండలు జాతీయ ర్యాంకు సాధించారు. సైన్స్ ఒలంపియాడ్‌లో తొమ్మిదవ తరగతికి చెందిన రిషెంద్ర తొంట, ఎనిమిదవ తరగతి విద్యార్థిని ఆర్. వేదిక, 7వ తరగతి విద్యార్థులు ప్రతీక్ రెడ్డి నల్ల, ఉత్సవ్ సాయి కొల్లూరి, సుమాక్షిత్ రెడ్డిలు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో విద్యార్థుల అభినందన సభ, బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి విద్యార్థిని, విద్యార్థులను ఘనంగా సన్మానించి, బహుమతులను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మ్యాథ్స్, సైన్స్ పట్ల అవగాహన కల్పించడమే కాకుండా వాటిలోని అంశాలను సమగ్రంగా విద్యార్థులకు విశ్లేష్ణాత్మకంగా తెలుపాలని తద్వారా వివిధ అంశాల పట్ల అవగాహన పెరుగుతుందని తెలిపారు. మన దేశ శాస్త్రవేత్తలైన జె.సి.బోస్, సి.వి. రామన్ తదితరుల నుంచి స్ఫూర్తిని పొంది నూతన ఆవిష్కరణలకు ప్రేరణ కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# గోదావరి జలాలను చిగురుమామిడి మండలానికి తీసుకొచ్చిన ఘనత కెసిఆర్‌ది

### ఎంపిగా సంజయ్ ఎన్ని నిధులు తెచ్చారో ప్రకటించాలి

### హుస్నాబాద్‌లో కెటిఆర్ సభను విజయవంతం చేయాలి

### హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్

చిగురుమామిడి, మార్చి 14 (మనం న్యూస్): గోదావరి జలాలను చిగురుమామిడి మండలానికి తీసుకువచ్చిన ఘన త రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుదేనని హుస్నాబాద్ శాసనసభ్యులు వొడితెల సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని ఉద్ధరించినట్లు ప్రకటనలిస్తున్న బిజెపి అధ్యక్షులు బండి సంజయ్ ఈ ప్రాంత ఎంపిగా ఎన్ని నిధులు తెచ్చారో ప్రకటించాలని సవాల్ విసిరారు. నియోజకవర్గంలో అభివృద్ధి కేవలం బిఆర్ఎస్ వల్లనే జరిగిందని, గతంలో పనిచేసిన ఎంపి పొన్నం ప్రభాకర్, ప్రస్తుతం ఎంపి సంజయ్ కేవలం ప్రకటనల వరకే పరిమితమయ్యారని విమర్శించారు. మంగళవారం చిగురుమామిడి మండల కేంద్రంలో ఈ నెల 20వ తేదీన హుస్నాబాద్‌లో జరుగనున్న కెటిఆర్ బహిరంగ సభ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సతీష్‌కుమార్ మాట్లాడుతూ కెటిఆర్ హాజరుకానున్న సభకు పెద్ద ఎత్తున ప్రజలు, పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలవుతున్నాయన్నారు. శిశువు గర్భంలో ఉన్న నాటి నుంచి, రేపో మాపో చనిపోయే వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అమలు పరుస్తోన్న ఘనత కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే దేశవ్యా ప్తంగా ప్రజలు కెసిఆర్ నాయకత్వం కోసం ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. 70 ఏళ్ల పాలనలో కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు దేశానికి ఒరగబెట్టిందేమీ లేదని సతీష్‌కుమార్ విమర్శించారు. అన్ని ప్రాంతాల అభివృద్ధి, అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకుసాగుతోన్న బిఆర్ఎస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు సాగించడం, అబద్ధపు విమర్శల కు పాల్పడడం వంటి పనులకే బిజెపి, కాంగ్రెస్ పార్టీలు పరిమితమయ్యా యన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి కొత్త వినిత శ్రీనివాస్ రెడ్డి, జడ్పిటిసి సభ్యులు గీకురు రవీందర్, సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి, వైస్ ఎంపిపి బేతి రాజిరెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మామిడి అంజయ్య, జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



